సాక్షి
జనగామ

బుధవారం । 24 । మే । 2023



కేయూకు కొత్త శోభ
కాకతీయ యూనివర్సిటీకి కొత్త శోభ సంతరించుకుంది. రేపటి నుంచి 'న్యాక్' బృందం పర్యటించనున్న నేపథ్యంలో క్యాంపస్ సుందరీకరణ పనులు పూర్తి చేశారు. - 8లో▸



టిప్పర్‌ను తప్పించబోయి..
టిప్పర్‌ను తప్పించబోయి ఆర్టీసీ లగ్జరీ బస్సు అదుపుతప్పి రోడ్డు అవతలకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా ఎనిమిది మంది గాయపడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0°/27.0°

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్యాంకుల వద్ద కనిపించని సందడి



జనగామ: రిజర్వ్ బ్యాంకు రూ.2వేల నోటు రద్దు చేసిన తర్వాత మంగళవారం నుంచి రిటర్న్‌కు అవకాశం కల్పించింది. గతంలో పెద్ద నోట్లు రద్దు చేసిన సమయంలో.. బ్యాంకుల వద్ద బారులుదీరి కనిపించిన జనం.. తాజా ప్రకటన తర్వాత హడావుడి లేకుండా పోయింది. ఒకరిద్దరు మాత్రమే రూ.రెండు వేల నోట్లు మార్చుకోవడానికి వచ్చారు. అయితే పండ్ల వ్యాపారం నుంచి మొదలు.. బంగారం, సూపర్‌మార్కెట్ వరకు ఫోన్‌పే, గూగుల్‌పే, నెట్ బ్యాంకింగ్ ఇలా ఆన్‌లైన్ సేవలతో వ్యాపారం జరుగుతుండడంతో.. మెజార్టీ ప్రజల వద్ద రూ.2వేల నోట్లు అరుదైపోయాయి. కేవలం రియల్టర్లు, రాజకీయ నాయకులు, రోజువారీగా లక్షల్లో వ్యాపారం చేసేవారి వద్దే కనిపిస్తున్నాయి.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆలేరు కళాశాల ప్రిన్సిపాల్ బి.హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్ అడ్మిషన్లకు అవకాశం ఉందని, జిల్లాలోని విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 98668 43920 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి
స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌డీఓ కృష్ణవేణి



స్టేషన్‌ఘన్‌పూర్: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి.. ఇందుకు బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని ఘన్‌పూర్ ఆర్‌డీఓ కృష్ణవేణి అన్నారు. వివిధ మండలాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మట్లాడారు. ఓటరు నమోదు, సవరణ, తొలగింపులు, మార్పులు చేర్పుల ప్రక్రియను ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పూల్‌సింగ్‌చౌహాన్, రజిని, విమలరామన్, నాయబ్ తహసీల్దార్లు రామారావు, రాజు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాజు, నర్సయ్య, ఎంఆర్‌ఐ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళా సమ్మాన్'తో ఆర్థికాభివృద్ధి
తపాలా శాఖ జనగామ ఏఎస్ రమాదేవి



హెడ్‌పోస్టాఫీస్ ఎదుట బాలికలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమాదేవి

జనగామ: మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ జనగామ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మూల రమాదేవి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక హెడ్‌పోస్టాఫీస్ ఎదుట బాలికలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం పథకం వివరాలు వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన యువతులతోపాటు మైనర్ బాలికల పేరిట సంరక్షకులు సమ్మాన్ ఖాతా తీసుకోవచ్చన్నారు. పొదుపు చేసిన మొత్తానికి 7.5 శాతం వడ్డీ వస్తుందని చెప్పారు. ఆధార్, పాన్ కార్డు, మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో సమీప పోస్టాఫీసు లేదా బ్రాంచి పోస్టాఫీస్‌లో ఖాతా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఖాతా కాలపరిమితి రెండేళ్లు మాత్రమే ఉంటుందని, ఇందులో కనిష్టంగా రూ.వెయ్యి, గరిష్టంగా రూ.2లక్షలు జమ చేసుకోవచ్చని సూచించారు. జమ చేసిన సొమ్ములో ఏడాది తర్వాత 40 శాతం తిరిగి తీసుకునే అవకాశం ఉన్నట్లు వివరించారు. అలాగే ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఆరు నెలల తర్వాత 5.5 శాతం వడ్డీతో ఖాతను ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జనగామ పోస్టుమాస్టర్ బ్రహ్మేశ్వర సింగ్, భిక్షపతి, వీరమల్లారెడ్డి, చేర్యాల, మద్దూర్, మర్రిముస్త్యాల తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్‌లో 'ఓరుగల్లు' సత్తా

శాఖమూరి శ్రీసాయి అశ్రిత్‌కు 40వ ర్యాంకు
- మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్!
- యూపీఎస్సీ ఫలితాల్లో మరో నలుగురికి ర్యాంకులు
- ఇంటివద్దే చదువుకుని 217వ ర్యాంకు సాధించిన జయసింహారెడ్డి
- అదే తోవలో పత్తిపాక సాయికిరణ్‌కు 460వ ర్యాంకు
- రాంనగర్‌కు చెందిన కొట్టె రుత్విక్ సాయికి 558 ర్యాంకు
- మూడో ప్రయత్నంలో 646వ ర్యాంకు సాధించిన అపూర్వ

సివిల్స్‌లో ఓరుగల్లు బిడ్డలు సత్తా చాటారు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్–2022 తుది ఫలితాలు మంగళవారం వెలువడగా పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ ప్రాంత విద్యార్థులు విజయపతాకం ఎగురవేశారని జిల్లావాసులు హర్షం వ్యక్తం చేశారు. మొదటి ప్రయత్నంలోనే 40వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్న శ్రీసాయి అశ్రిత్ స్వగ్రామంలో ప్రజలు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు జరుపుకున్నారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ/విద్యారణ్యపురి/ఎల్కతుర్తి/చిట్యాల

మొదటి ప్రయత్నంలోనే శ్రీసాయి అశ్రిత్ విజయం..
- ఐఏఎస్‌కు ఎంపికయ్యే అవకాశం..



శ్రీసాయి అశ్రిత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తల్లిదండ్రులు పద్మజ, అమర్



గ్రామంలో స్వీట్లు పంచుకుంటున్న గ్రామస్తులు

మొదటి ప్రయత్నంలోనే శాఖమూరి శ్రీసాయి అశ్రిత్ సివిల్స్‌లో 40వ ర్యాంకు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. జేఎస్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లికి చెందిన శాఖమూరి అమర్ ఇంటర్మీడియట్ చదివిన నాటి నుంచి హనుమకొండలో స్థిరపడ్డారు. అమర్, పద్మజ దంపతులు రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఉన్నారు. బిల్డర్స్‌గా కొనసాగుతున్నారు. వీరి కుమారుడు శ్రీసాయి అశ్రిత్ సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో పట్టుదలగా ముందుకెళ్లి మొదటి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి 40వ ర్యాంకు సాధించారు.

ప్రాథమిక విద్య వరంగల్‌లోనే..
శ్రీసాయి అశ్రిత్ పాఠశాల విద్య హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో సాగింది. హైదరాబాద్ శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. బిట్స్ పిలానీలో బీటెక్ చదివారు. 2021లో బీటెక్ పూర్తి చేసిన వెంటనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో కొద్ది రోజులు కోచింగ్ తీసుకున్నా.. ఆ తర్వాత ఇంటి వద్దనే ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుని లక్ష్యాన్ని సాధించారు. ఐఏఎస్ కావాలనే పట్టుదలను నెరవేర్చుకున్నారు. తమ కుమారుడు సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు శాఖమూరి పద్మజ, అమర్ సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో సంబరాలు జరుపుకున్నారు.

అశ్రిత్ స్వగ్రామంలో వేడుకలు
అశ్రిత్‌కు సివిల్స్‌లో ర్యాంకు సాధించడంతో ఆయన స్వగ్రామమైన గుంటూరుపల్లిలో గ్రామస్తులు వేడుకలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. తమ గ్రామం గతంలో తిరుమలాయపురానికి ఆవాసంగా ఉండేదని, కొత్త జీపీగా ఏర్పాటైన తరువాత గ్రామ యువకుడికి సివిల్స్‌లో మెరుగైన ర్యాంక్ వచ్చిందని సర్పంచ్ పువ్వాటి రాణివెంకటేశ్వర్లు తెలిపారు. ఇక్కడి ప్రజలకు, గ్రామానికి అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

'జయ'హో సింహారెడ్డి..
- ఐపీఎస్‌కి ఎంపియ్యే అవకాశం



హనుమకొండలో జయసింహారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ బాధ్యులు

హనుమకొండ హంటర్‌రోడ్డులోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల ఉమ్మారెడ్డి లక్ష్మి దంపతుల కుమారుడు రావుల జయసింహారెడ్డి సివిల్స్ సర్వీస్ ఫలితాల్లో 217వ ర్యాంకు సాధించారు. హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను 2019లో పూర్తిచేశారు. ఆరునెలల పాటు ఓ స్టార్టప్ కంపెనీ ఉద్యోగంలో చేశారు. అనంతరం సివిల్స్ పైనే దృష్టి సారించి ప్రిపేర్ అవుతూ వస్తున్నారు. సివిల్స్‌రాయడం ఇది మూడవసారి. ఇందులో 217వ ర్యాంకు సాధించాడు. ఐఏఎస్ కావాలని అనుకున్నప్పటికీ ఈ ర్యాంకుతో ఐపీఎస్ వస్తుందని, తప్పకుండా ఐపీఎస్‌గా ఉద్యోగంలో చేరుతానని జయనర్సింహారెడ్డి తెలిపారు. ఉమ్మారెడ్డి ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. తన కుమారుడికి 217వ ర్యాంకు రావటం పట్ల సంతోషంగా ఉందని ఉమ్మారెడ్డి లక్ష్మి దంపతులు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చి 217వ ర్యాంకు సాధించిన జయసింహారెడ్డిని పలువురు సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో రెడ్డి జేఏసీ అధ్యక్షుడు గోపి జైపాల్ రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, నల్లరాజు రెడ్డి, నరహరి తిరుపతిరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, బండి నర్సింహారెడ్డి, ముదిగంటి వెంకటరెడ్డి, నల్ల రాంరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తాటిపెల్లి గణపతిరెడ్డి పాల్గొన్నారు.

మూడోసారి సక్సెస్



సాయికిరణ్‌కు మిఠాయి తినిపిస్తున్న కుటుంబసభ్యులు

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక సాయికిరణ్ సివిల్స్‌లో 460 ర్యాంక్ సాధించాడు. పత్తిపాక కొమురెల్లి–లక్ష్మి దంపతుల కుమారుడు సాయికిరణ్ ఎల్కతుర్తిలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో 6వ తరగతి వరకు చదివారు. ఆ తరువాత హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్టలోని గ్రీన్‌వుడ్ స్కూల్‌లో 10వ తరగతి వరకు విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లో ఇంటర్, సీబీఐటీలో ఇంజనీరింగ్ చదివారు. ఎంబీఏ ఐఏఎం కోజీకోడ్ కేరళలో పూర్తి చేసి మూడేళ్లు ఉద్యోగం చేశారు. 2019లో సివిల్స్‌లో మొదటిసారి ప్రిలిమ్స్ చేరుకున్న సాయికిరణ్.. మెయిన్స్‌కు ఎంపిక కాలేదు. రెండోసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లినా లిస్టులో పోయింది. మూడోసారి విజయం సాధించి 460వ ర్యాంకు సాధించాడు. సాయికిరణ్‌కు సివిల్స్ ర్యాంక్ రావడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



సాయికిరణ్

సివిల్స్ ర్యాంకు 'కొట్టే'శాడు!



రిత్విక్ సాయికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు కొట్టె మంజుల, రాధాకృష్ణారావు

మొదటి మూడు పర్యాయాలు ప్రిలిమ్స్ వరకే వెళ్లిన రిత్విక్.. నాలుగోసారి మెయిన్స్ వరకు చేరుకున్నారు. ఐదో ప్రయత్నంలో ప్రిలిమనరీ, మెయిన్స్‌తోపాటు ఇంటర్వ్యూకు చేరుకుని 558వ ర్యాంకు సాధించాడు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన కొట్టె రాధాకృష్ణారావు, మంజుల దంపతులకు కుమారుడు రిత్విక్ సాయి, కుమార్తె రిషిక ఉన్నారు. రిత్విక్ సాయి తండ్రి రాధాకృష్ణారావు హసన్‌పర్తి భీమారంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో లైబ్రేరియన్. తల్లి మంజుల ఫ్యామిలీ కౌన్సిలర్. రిత్విక్ సాయి పాఠశాల విద్య హనుమకొండ బాలసముద్రంలోని గురుకుల్ పాఠశాలలో పూర్తి చేశారు. హైదరాబాద్ కొంపెల్లిలోని పేజ్ అకాడమీలో ఇంటర్మీడియట్ చదివారు. బీటెక్ ఈసీఈ ఢిల్లీ నోయిడాలోని శివనాడార్ యూనివర్సిటీలో అభ్యసించాడు. బీటెక్ పూర్తి చేసిన తర్వాత మల్టీ నేషనల్ కంపెనీలో నెలకు రూ.1.50 లక్షల జీతంతో ఉద్యోగం రాగా, సివిల్స్‌పై ఉన్న ఆసక్తితో ఉద్యోగంలో చేరలేదు.

ఐపీఎస్ ప్రథమ ప్రాధాన్యత : రిత్విక్ సాయి
ఐపీఎస్ నా ప్రథమ ప్రాధాన్యత. అయితే ఐఆర్ఎస్, ఐటీకి ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2017 నుంచి సివిల్స్‌కు సిద్ధమవుతున్నా. సివిల్స్ ద్వారా ప్రజాసేవ చేయొచ్చని పట్టుదలతో చదివా. 2017 నుంచి ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నా. నా పట్టుదలకు తోడు అదృష్టం కలిసి వచ్చింది.

ర్యాంకు రావడం సంతోషకంగా ఉంది : రాధాకృష్ణారావు, మంజుల
మా కుమారుడికి సివిల్స్ 558వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. చిన్న నాటినుంచి ప్రజా సేవ చేయాలనే ఆసక్తి ఉండేది. సివిల్స్ ద్వారా అయితే మంచి అవకాశమని భావించి ఈ దిశగా కష్టపడ్డాడు. ఐదేళ్లుగా పండుగలు, శుభకార్యాలకు దూరంగా ఉన్నాడు.

బోధిస్తూ.. సాధించారు..
- మంద 'అపూర్వ ప్రతిభ'..



మంద అపూర్వ

సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కోచింగ్ ఇస్తూనే తాను పరీక్షలకు హాజరై ఆశించిన స్థాయిలో ర్యాంకు సాధించి మార్గదర్శకంగా నిలిచారు మంద అపూర్వ. హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన మంద అశోక్ కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, తల్లి రజనీదేవి భీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వీరి కూతురు అపూర్వ సివిల్స్‌లో మూడో ప్రయత్నంలో 646వ ర్యాంకు సాధించారు. హనుమకొండ విజ్ఞాన్ స్కూల్‌లో పాఠశాల విద్య, ఎస్‌ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అపూర్వ ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ అభ్యసించారు. అనంతరం ఇదే కళాశాలలో ఎంటెక్‌లో ప్రవేశం పొందారు. ఎంటెక్ చేస్తూ సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. ప్రారంభంలో ఢిల్లీలో 3 నెలల పాటు కోచింగ్ తీసుకున్నారు. అక్కడి వాతావరణం పడక పోవడంతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. బెంగళూరులోని శంకర్ ఐఏఎస్ అకాడమీలో ఫ్యాకల్టీగా చేరి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు బోధిస్తూ తానూ ప్రిపేర్ అయ్యారు. మొదటి ప్రయత్నంలో మెయిన్స్ వరకు వెళ్లగా, రెండో ప్రయత్నంలో ఇంటర్వ్యూకు వెళ్లారు. ఆశించిన స్థాయి ర్యాంకు రాకపోవడంతో మరోసారి సివిల్స్‌కు హాజరయ్యారు. మూడో ప్రయత్నంలో 646వ ర్యాంకు సాధించారు.

ఆ గౌరవం చూసి కలెక్టర్ పోస్టుపై ఆసక్తి : మంద అశోక్‌కుమార్
చిన్నప్పుడు అపూర్వను స్కూల్‌కు కలెక్టర్ బంగ్లా ముందు నుంచి తీసుకెళుతుండగా ఇందులో ఎవరు ఉంటారని ప్రశ్నించింది. కలెక్టర్ ఉంటారని చెప్పేవాడిని. కలెక్టర్ కావాలంటే ఏం చేయాలని అడిగితే సివిల్స్ రాయాలని చెప్పాను. అప్పటి నుంచి ఆసక్తి పెరిగింది. దీంతోపాటు అప్పటి కలెక్టర్ శ్రీధర్ ఒక సందర్భంలో వేయి స్తంభాల దేవాలయానికి వచ్చినప్పుడు ఆయనకు దక్కిన గౌరవాన్ని చూడడంతో మరింత పట్టుదల పెరిగింది.

గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు
- వీసీలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

జనగామ: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందించనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం, తల్లి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. గర్భిణులు ఆస్పత్రుల్లో నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాడానికి పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వీసీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్, డీఆర్డీఓ రాంరెడ్డి, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు, డాక్టర్ రవీందర్, ఉప వైద్యాధికారులు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ భాస్కర్, పీఆర్, ఇరిగేషన్ ఈఈలు చంద్రశేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లారీలు ఆపి.. కేంద్రాలకు పంపి..
- అన్నదాత కష్టం చూసి స్పందించిన అధికారులు



లారీలను ఆపుతున్న అదనపు కలెక్టర్ తదితరులు

రఘునాథపల్లి: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి జిల్లా అధికారులు స్పందించారు. వాహనాల కొరతతో ధాన్యం తరలింపు జాప్యం అవుతుండగా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, తహసీల్దార్ ఎండీ. అన్వర్, ఎస్సై రఘుపతి మంగళవారం రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఇసుక తరలింపునకు వరంగల్ వైపు వెళ్తున్న లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించారు. కొందరు డ్రైవర్లు వినకపోవడంతో వాహన యజమానులతో మాట్లాడి.. ధాన్యం తరలింపునకు వెళ్లేలా ఒప్పించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, ఏపీఎం సారయ్య, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రశాంత్

జనగామ: జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రశాంత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలన్నారు. అత్యవసర పనులుంటే ఉదయం 10 లోపు.. సాయంత్రం 5 గంటల తర్వాత చూసుకోవాలని సూచించారు. ఎండదెబ్బ తగలకుండా తెల్లటి వస్త్రంతో తలపాగా చుట్టుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, ఎంసీహెచ్ పీఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, పీఓ డాక్టర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష మెజార్టీతో గెలుస్తా..

- టాప్ టెన్‌లో జనగామ ఉంది
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలిచే సీట్లలో జనగామ టాప్ టెన్‌లో ఉంది.. ఈసారి లక్ష మెజార్టీ సాధిస్తామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓంసాయి గార్డెన్‌లో బైరగోని యాదగిరి అధ్యక్షతన జరిగిన జనగామ మండల రెండవ క్లస్టర్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం రాకముందు పరిస్థితులు.. తెలంగాణ సిద్ధించాక ప్రగతి ఎలా ఉందో ప్రజలకు వివరించడానికి ఆత్మీయ సమ్మేళనాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కరువుకు నిలయంగా ఉన్న జనగామలో ప్రతి గ్రామానికి గోదావరి నీరు అందించి రైతు పాదాలు కడిగిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారు. ఇరిగేషన్ మంత్రిగా పొన్నాల లక్ష్మయ్య ఉన్న సమయంలో స్వయంగా తాను నీళ్ల కోసం అనేక కష్టాలు పడ్డానని, కాల్వ ద్వారా నీరివ్వ లేని పరిస్థితి నాడు ఉందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సన్నాసులు అక్కడక్కడా మాట్లాడడం కాకుండా.. రాష్ట్రం నుంచి కేంద్రం తీసుకున్న రూ.2 లక్షల కోట్లు ఢిల్లీలో ఉన్నాయనీ.. దమ్ముంటే రాష్ట్ర నాయకులు అభివృద్ధికి నిధులు తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు ఉచితాలు కావని, తెలంగాణలో ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని అన్నారు. గతంలో మండలానికి పింఛన్‌కింద రూ.17 లక్షలు వచ్చేవని, నేడు రూ.కోటి 60 లక్షలు వస్తున్నాయని, రూ.6 కోట్ల వరకు రైతు బీమా, రూ.23 కోట్ల వరకు రైతుబంధు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం విజయ, రైతుబంధు మండల కోఆర్డినేటర్ ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెయిన్ పనుల పరిశీలన
జనగామ: ఆర్టీసీ చౌరస్తాలో చేపట్టిన వాటర్ ఫౌంటెయిన్ పనులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పరిశీలించారు. ఐదు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫౌంటెయిన్ చుట్టూ చేపట్టే పనులపై సూచనలు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో జిల్లా కేంద్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రావెల రవి, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, మిద్దెపాక లెనిన్ తదితరులు ఉన్నారు.

పంట నష్టం ఖరారు

- 23,858 మంది రైతులకు చెందిన 41,303 ఎకరాల్లో పంటలు ధ్వంసం
- రైతును ముంచిన అకాల వర్షాలు
- క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది సర్వే
- కలెక్టర్‌కు తుది నివేదిక అందజేత

జనగామ: యాసంగి సీజన్‌లో ప్రకృతి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న ఇతర పంటలు, మామిడి తోటలకు తీవ్ర నష్టం కలిగించింది. కొంత కాలంగా వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వానాకాలంలో ఎండలు.. వేసవిలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయమంటేనే వణికి పోతున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో జిల్లాలో రికార్డు స్థాయిలో కురిసిన వడగళ్లు, అకాల వర్షాలతో 23,858 మంది రైతులకు చెందిన 41,303 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, టుబాకో, మామిడి ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో నాలుగు వేల ఎకరాలు మామిడి, వెయ్యి ఎకరాలు మొక్కజొన్న, మిగతా మొత్తం వరి ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తుది నివేదిక తయారు చేశారు.

వెంటాడిన అకాల వర్షాలు
జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 1.31లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. ఇందులో 1.27లక్షల ఎకరాల్లో వరి, మిగతా మొక్కజొన్న తదితర పంటలు సాగైనట్లు అధికారులు నమోదు చేశారు. అలాగే సుమారు 12వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 18 నుంచి 22, ఏప్రిల్ 22 నుంచి 27వ తేదీ వరకు అకాల వర్షాలు, ఈదురు గాలులు, భారీ స్థాయి వడగళ్లు కురిశాయి. దీంతో వేలాది ఎకరాల్లో కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటలు.. మామిడి తోటలు.. ఇతర ఆరుతడి పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. కనీసం పెట్టుబడులు సైతం రాని దయనీయ పరిస్థితుల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పడంతో పాటు వ్యవసాయ శాఖను అప్రమత్తం చేసింది. అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయగా ప్రభుత్వానికి పంపించారు.

కలెక్టర్‌కు తుది జాబితా..
జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్లు, అకాల వర్షాల కారణంగా పంటలకు జరిగిన నష్టం అంచనాను తయారు చేసి కలెక్టర్‌కు పంపించాం. 23,858 రైతులకు చెందిన 41,303 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. నష్టం రూ.41.30 కోట్లుగా అంచనా వేశాం. మార్చిలో నష్టపోయిన పంటలకు రూ.4కోట్లు మంజూరు కాగా, ఏప్రిల్‌కు సంబంధించి పరిహారం రావాల్సి ఉంది.



– వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్లు, అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలు

	మార్చి		ఏప్రిల్	
మండలం	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు
జనగామ	10	43.17	4,909	9,107
నర్మెట	134	122.12	5,026	8,565
తరిగొప్పుల	301	168.18	726	1,013
కొడకండ్ల	2,389	3,351	288	291.34
దేవరుప్పుల	256	217.21	10	12
పాలకుర్తి	117	109.17	51	83.33
స్టేషన్‌ఘన్‌పూర్	76	79.3	234	233.22
చిల్పూరు	200	234.09	441	440.24
జఫర్‌గఢ్	215	286.05	01	2.2
బచ్చన్నపేట	-	-	5,890	13,880
లింగాలఘణపురం	-	-	305	431.36
రఘునాథపల్లి	-	-	2,279	2,628

కేయూకు కొత్త శోభ

- రేపటి నుంచి 'న్యాక్' పరిశీలన
- క్యాంపస్‌లో సుందరీకరణ పనులు పూర్తి
- 28 విభాగాలు, ఆరు కళాశాలల్లో సర్వంసిద్ధం


ముస్తాబైన కేయూ పరిపాలనా భవనం

కేయూ క్యాంపస్ : తెలంగాణాలో ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీగా కాకతీయ యూనివర్సిటీకి పేరుంది. తొలుత ఉస్మానియా వర్సిటీ పరిధిలో పీజీ సెంటర్‌గా ఏర్పాటై అనంతరం 1976 ఆగస్టు 19న కాకతీయ విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. అంచెలంచెలుగా ఎదుగుతూ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లోని 290 డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులతోపాటు లక్షలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆటానమస్ గుర్తింపు కలిగి ఉంది.

14 విభాగాల్లో 'న్యాక్' పరిశీలన

కేయూలో 28 విభాగాలుండగా ఆరు కళాశాలలున్నాయి. అన్ని విభాగాల్లోని, క్యాంపస్‌లోని ఆయా కళాశాలల్లో అకాడమిక్, పరిశోధనలు, ప్రాజెక్టుల పరంగా విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయలను న్యాక్ బృందం పరిశీలించనుంది. అయితే 14 విభాగాలను న్యాక్ బృందం ఖచ్చితంగా పరిశీలిస్తుంది. ఈ క్రమంలో అన్ని విభాగాల అధ్యాపకులు సిద్ధం అవుతున్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అన్ని విభాగాలు సిద్ధం

క్యాంపస్‌లోని అన్ని విభాగాల అధిపతులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లతో అకాడమిక్, పరిశోధనల అంశాలు, అధ్యాపకుల, విద్యార్థుల అచీవ్‌మెంట్స్ రూపొందించుకున్నారు. అయితే విభాగాల, కళాశాలల వారీగా పర్ఫార్మెన్స్‌ను వీసీ, రిజిస్ట్రార్ పలుసార్లు పరిశీలించారు. లోపాలు సవరించారు.

లైబ్రరీ కూడా ముస్తాబు

కేయూలో సెంట్రల్ లైబ్రరీతోపాటు రీడింగ్ రూమ్ 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. వివిధ కోర్సుల పుస్తకాలతోపాటు ఫ్రీ వైఫై, ఇ-జర్నల్స్, ఈ-థీసీస్‌లు, ఈ-బుక్స్ ఉన్నాయి. వెబ్‌సైట్‌ల లింకులు ప్రొవైడ్ చేస్తారు. లైబ్రరీలో లక్షా 40 వేల పుస్తకాలు ఉన్నాయి. దివ్యాంగులకు వీల్‌చైర్, ర్యాంప్ కూడా ఉంది. ప్యూర్‌ఫైడ్ డ్రింకింగ్ వాటర్ లభిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసమూ అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

న్యాక్‌కు సర్వం సిద్ధం-ఏడుగురితో కూడిన బృందం రాక

కాకతీయ యూనివర్సిటీ 2003లో నేషనల్ అసెస్మెంట్ అక్రెడిటేషన్ (న్యాక్) 'బీ' గ్రేడ్ కలిగి ఉండి 2009లో 'ఏ' గ్రేడ్ సాధించింది. మళ్లీ 2017లో 'ఏ' గ్రేడ్ సాధించింది. మళ్లీ అక్రెడిటేషన్ కోసం కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఇటీవల సెల్ఫ్ స్టడీ రిపోర్టును (ఎస్ఎస్ఆర్) పంపించారు. ఇంటర్నెల్ క్వాలిటీ సెల్ డైరెక్టర్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆచార్యులు నర్సింహాచారి వ్యవహరిస్తున్నారు. న్యాక్ బృందం ఈనెల 25, 26, 27 తేదీల్లో క్యాంపస్‌కు రానుండటంతో గత కొన్ని నెలలుగా వీసీ ఆచార్య టి.రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు అధ్యాపకులను, నాన్‌టీచింగ్ ఉద్యోగులను, విభాగాల వారీగా సన్నద్ధం చేస్తున్నారు. పలుసార్లు అధ్యాపకులతో, నాన్ టీచింగ్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సమీక్షించారు.

12 హాస్టళ్లు-4 మెస్‌లు

కేయూలో 12 హాస్టళ్లు 4 మెస్‌లున్నాయి. పోతన, న్యూ పీజీ బాయ్స్ హాస్టళ్లతోపాటు పద్మాక్షి మహిళా హాస్టల్, ఇంజనీరింగ్, తదితర హాస్టళ్లున్నాయి. సుమారు 3 వేల మందికిపైగా విద్యార్థులుంటున్నారు. క్యాంపస్‌లో మూడు మెస్‌లుండగా బయట లా విద్యార్థులకు ఒక మెస్ ఉంది.

ఎన్ఎస్ఎస్‌తోపాటు వివిధ సెంటర్లు..

కేయూలో పరిధిలో 360 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా సుమారు 36 వేల మంది వలంటీర్లు ఉన్నారు. జాతీయ స్థాయిలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్‌కు గతేడాది రాష్ట్రపతి చేతుల మీదుగా వీసీ ఆచార్య రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి బెస్ట్ అవార్డు అందుకున్నారు.



అలాగే యూనివర్సిటీలో అంబేద్కర్ స్టడీ సెంటర్, మహిళా అధ్యయన కేంద్రం, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్, గైడెన్స్‌సెల్, ప్లేస్‌మెంటు సెల్, యోగా సెంటర్, బీసీ సెల్, ఎస్సీ, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్ కూడా ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సైతం ముస్తాబు చేశారు.

క్యాంపస్‌లో సుందరీకరణ

క్యాంపస్‌లో అన్ని విభాగాల వద్ద సుందరీకరణ పనులు చేపట్టారు. భవనాలకు మరమ్మతులు చేయించి రంగులు వేయించారు. పలు విభాగాల వద్ద పూలకుండీలు, మొక్కలు, పచ్చదనంతో కొత్తశోభ సంతరించుకుంది. సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. దూరవిద్యా కేంద్రాన్ని ముస్తాబు చేశారు.

'ఏ' గ్రేడ్ సాధ్యమేనా?

న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించేలా యూనివర్సిటీ అధికారలు ప్రయత్నాలు చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు, భవనాలు బాగానే ఉన్నా అధ్యాపకల కొరత వేధిస్తోంది. విభాగాల అధిపతుల, ప్రిన్సిపాళ్ల పర్ఫార్మెన్స్‌పై గ్రేడ్ ఆధారపడి ఉంటుంది. తొలిరోజు 25న ఉదయం 9.30 గంటలకు న్యాక్ బృందం ఎదుట కేయూ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వీసీ ఆచార్య తాటికొండ రమేష్ వివరిస్తారు. అనంతరం న్యాక్ బృందాలుగా విభాగాలను సందర్శించి పరిశీలిస్తుంది. 70 శాతం ఎస్ఎస్ఆర్ రిపోర్ట్ ఆధారంగా మార్కులు లభిస్తాయి పరిశీలన మీద 30 శాతం మార్కులొస్తాయి. రిపోర్టులో పేర్కొన్న అంశాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయా? అనేది కమిటీ పరిశీలిస్తుంది. న్యాక్ బృందం రానుండటంతో యూనివర్సిటీ అధ్యాపకులతో 12 కమిటీలు ఏర్పాటు చేసింది.

ఎస్ఎస్ఆర్ రిపోర్టులో 273 మంది అధ్యాపకులు

నేషనల్ అసెస్‌మెంట్ అక్రెడిటేషన్ రిపోర్టులో కేయూ క్యాంపస్‌లోని అన్ని విభాగాలు, కళాశాలల్లో కలిసి 273 మంది రెగ్యులర్, కాంట్రాక్టు, ఫుల్ వర్క్ లోడ్ కలిగిన పార్ట్‌టైం అధ్యాపకులున్నట్లు పేర్కొన్నారు.

టిప్పర్‌ను తప్పించబోయి..


క్షతగాత్రులతో మాట్లాడుతున్న డీఎం జ్యోత్స్న


చికిత్స పొందుతున్న అరుణ, శిరీష

- రోడ్డు ఆవలికి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- డ్రైవర్‌తో సహా ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులను జనగామ జిల్లా ఆస్పత్రికి తరలింపు
- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం


రోడ్డు దిగి దూసుకెళ్లిన బస్సు


చికిత్స పొందుతున్న కృష్ణ


డాక్టర్ లక్ష్మీపతి,


యశస్విని


కల్యాని, హిరోషిని

లింగాలఘణపురం/జనగామ: వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నెల్లుట్ల బైపాస్ సమీపంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు.. టిప్పర్‌ను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు ఆవలికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు 17 మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో జనగామ సమీప నెల్లుట్ల బైపాస్ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న టిప్పర్‌ను తప్పించబోయి ఎడమ వైపునకు దూసుకెళ్లింది. రోడ్డు కిందికి దూసుకెళ్లి సిమెంట్ దిమ్మెను, చెట్టును ఢీకొట్టడంతో బస్సు ముందు భాగం అంతా ధ్వంసమైంది. ముందు టైర్ ఊడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బస్సు డ్రైవర్ ఎస్.మహేందర్ అప్రమత్తతతో త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

గాయపడిన వారు ఇలా..

బస్సు ప్రమాదంలో హైదరాబాద్ కూకట్‌పల్లి ఇండియన్ ఫార్మసీ కంపెనీ మేనేజర్ ఎం.కృష్ణ, వరంగల్‌కు చెందిన ఆదిలాబాద్ నిమ్స్ ఫార్మ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీపతి, ఎల్బీనగర్ ఏరియా హస్తినాపురానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆడెపు శిరీష, ఆమె తల్లి ఆడెపు అరుణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తిరుపతికి చెందిన పి.కల్యాణి బి.హిరోషి, హనుమకొండ హంటర్‌రోడ్డుకు చెందిన విద్యార్థిని యశస్విని ఉన్నారు. ఇందులో ఎం.కృష్ణ, డ్రైవర్ మహేందర్ కాలు విరిగిపోగా, డాక్టర్ లక్ష్మీపతి తల, శరీరభాగాలకు బలమైన గాయాలయ్యాయి.

టిప్పర్ డ్రైవర్‌దే పొరపాటు



హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్నాం. నెల్లుట్ల బైపాస్ సమీపాన ఎదురుగా వచ్చిన టిప్పర్ ఒక్కసారిగా వేగం తగ్గింది. గమనించి వెంటనే బస్సుకు బ్రేక్ వేశాను. ఇదే సమయంలో స్టీరింగ్ లాక్ కావడంతో బస్సు ఎడమవైపు దూసుకు పోయింది. కంట్రోల్ చేసే ప్రయత్నంలో పల్టీ కొట్టకుండా ఆగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 17 మంది ప్రయాణికులు ఉన్నారు.

\- మహేందర్, బస్సు డ్రైవర్

తల్లీ కూతుళ్లు అరుణ, శిరీష, విద్యార్థిని యశస్విని, తిరుపతికి చెందిన కల్యాణి, హిరోషీలకు స్వల్ప గాయాలైనట్లు డాక్టర్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని వరంగల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

పరామర్శించిన ఆర్టీసీ డిపోమేనేజర్

జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బస్సులో క్షేమంగా ఉన్న 10 మందిని మరో బస్సులో పంపించగా, క్షతగాత్రుల సంబంధీకులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. స్వల్ప గాయాలైన వారిని చికిత్స అనంతరం స్వగ్రామాలకు పంపించేలా సిబ్బందికి సూచనలు చేశారు.

కేఎంసీకి మాజీ మావోయిస్టు పార్థివదేహం అప్పగింత

ఎంజీఎం : వరంగల్‌లో నివాసముంటున్న మాజీ మావోయిస్టు నూతి చత్రపతి శివాజీ పార్థివదేహాన్ని తెలంగాణ నేత్ర, అవయవ శరీరదాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి అధ్వర్యంలో కేఎంసీకి మంగళవారం అప్పగించారు. ఆయన ఎంజీఎంలో సోమవారం మృతి చెందగా ఆయన భార్య కౌసల్య, కూతుర్లు అరుణ, ఆమని అంగీకారంతో నేత్ర దానం చేశారు. అనంతరం పార్థివదేహాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, అనాటమీ సిబ్బందికి అప్పగించారు.

వేపచెట్టు మండ విరిగి బాలిక మృతి


కన్న శ్రీజ (ఫైల్)

ఐనవోలు : వేపచెట్టు మండ విరిగి మీద పడడంతో ఆ చెట్టు కింద నిద్రిస్తున్న బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని నందనం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై, గ్రామస్తుల కథనం ప్రకారం.. కన్న సురేందర్, రజిత దంపతులకు కూతురు శ్రీజ (9) వేసవి కాలం కావడంతో సోమవారం రాత్రి ఆరుబయట మంచంలో సోదరుడు శివ శంకర్‌తో కలిసి నిద్రిస్తుండగా అర్ధరాత్రి వేళ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు చెందిన వేప చెట్టు మండ అకస్మాత్తుగా విరిగి శ్రీజ తలపై పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా శ్రీజను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. 'శ్రీజ గతంలో రెండు సార్లు ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కిందని, ఈసారి మాత్రం దేవుడు తీసుకెళ్లాడు' అంటూ తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు శ్రీజ మృతదేహానికి వర్ధన్నపేటలో పోస్టుమార్టం చేయించారు. అనంతరం శ్రీజ అంత్యక్రియలు నిర్వహించారు.

చెట్టుకొమ్మలు కొట్టించాలని కోరినా పట్టించుకోలేదు..

చెట్టుకొమ్మలు, మండలు కొట్టించాలని గతంలోనే పలుమార్లు గ్రామ పంచాయతీ, అధికారులను కోరినా పట్టించుకోలేదని శ్రీజ తండ్రి సురేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. చెట్టుకొమ్మలు కొట్టించి ఉంటే తన కూతురు ప్రాణాలు పోయేవి కావని ఆయన కన్నీరు మున్నీరయ్యాడు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు..


రాజేష్ మృతదేహం

చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని బోజెర్వు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై తోట మహేందర్, గ్రామస్తుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి గ్రామానికి చెందిన కాసాని రజిత మల్లయ్య దంపతుల కొడుకు రాజేష్ (12) వ్యవసాయ బావి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో రాజేష్ కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకుని గజీతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. రాజేష్ గ్రామంలోని తన అమ్మమ్మ పాయిరాల సుభద్ర ఇంటి వద్దే ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. తన అమ్మమ్మకు చెందిన పశువులను మేపడానికి వెళ్లిన మహిళతో కలిసి గ్రామ శివారులో వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. మృతుడి తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..


జంపాల రఘు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన జంపాల రఘు (43) తన ద్విచక్ర వాహనంపై కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఈదులపూసపల్లి గ్రామ శివారులోకి చేరుకుంటుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రఘును స్థానికులు చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రఘు మృతి పట్ల ఒకటోవార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుదగాని మురళీ సంతాపం తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ ఎజెండా


సన్మానిస్తున్న అల్లం నారాయణ, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే రమేష్, ఎమ్మెల్సీ సారయ్య

- త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు
- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

నయీంనగర్ : జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే (143) ప్రధాన ఎజెండా అని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. త్వరలోనే వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందుతాయని ఆయన చెప్పారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని అల్లం నారాయణతోపాటు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేష్, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడారు. గెలుపు, ఓటములు సహజమన్నారు. యూనియన్ జర్నలిస్టుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ సాధనలో జర్నలిస్టులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. జర్నలిస్టులకు తమ వంతు సహకారాలు అందిస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్.లెనిన్, విష్ణువర్థన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తడక రాజ్‌నారాయణ, డెస్క్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శంకేసి శంకర్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మెండు రవీందర్, ప్రధాన కార్యదర్శి ఉమేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 36 పశువుల పట్టివేత

- ఆరుగురిపై కేసు.. మూడు వాహనాలు సీజ్

ఏటూరునాగారం : అక్రమంగా తరలిస్తున్న 36 పశువులను పట్టుకుని వాటిని రవాణా చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి మూడు వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఏటూరునాగారం చెక్‌పోస్ట్ వద్ద ఏఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు హరీష్, రమేష్ సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ దిశగా ఒక డీసీఎం, రెండు బోలేరో వాహనాల్లో 26 ఎద్దులు, 10 ఆవులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన మోరె కిరణ్, ములుగు మండలంలోని జంగాలపల్లికి చెందిన సమీర్, ఫారూఖ్, కోడిపుంజుల అంజి, తపట్ల నవదీప్, కొత్తగూడెంకు చెందిన గౌస్ పశువులను తరలిస్తున్నట్టు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే డీసీఎం, రెండు బోలేరోలను సీజ్ చేశారు. మొత్తం 36 పశువులను మేడారంలోని రాంపూర్ గోశాలకు తరలించారు. నిందితులు చర్ల పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేసి ములుగు జిల్లాలోని జంగాలపల్లి సంతలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్టు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. పశువులకు నీరు, ఆహారం కూడా ఇవ్వకపోవడంతోపాటు వాటిని వాహనాల్లో ఇరికించి తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


రోహిత్ (ఫైల్)

తొర్రూరు : ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిల్ అయ్యాయనే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై లింగారెడ్డి కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన చిల్ల వెంకటేష్, సువర్ణ దంపతుల కొడుకు రోహిత్ (17) ఇటీవల వెలవడిన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఫెయిలయ్యాడు. దీంతో కొద్దిరోజులుగా వేదనకు గురౌతున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 15న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు రోహిత్‌ను హనుమకొండలోని అజరా ఆస్పత్రిలో చేర్పగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రి, కొడుకుపై హత్య కేసు నమోదు

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన మామిడ్ల కృష్ణ తండ్రి రాములు, అన్న ఆంజనేయులుపై హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఈనెల 19న కృష్ణపై అతడి తండ్రి రాములు, అన్న అంజనేయులు ఆస్తి విషయమై గొడవ పడి దాడి చేశారని తెలిపారు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయాలైన కృష్ణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 22న (ఆదివారం) మృతి చెందాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు తండ్రి, కొడుకుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

భూపాలపల్లి అర్బన్ : అత్యాచారయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి నారాయణ బాబు మంగళవారం తీర్పు ఇచ్చారు. భూపాలపల్లి మండలంలోని ఓ గ్రామంలో 2019 అక్టోబర్ 11న ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారయత్నం చేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై అభినవ్ కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీంతో జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

దుగ్గొండి : వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లంపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొనికెల సమ్మక్క (60) అస్వస్థతకు గురైంది. ఆమెకు కుటుంబీకులు స్థానికంగా చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె వడదెబ్బకు గురై మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త కొంరయ్య, నలుగురు పిల్ల లున్నారు.

వడదెబ్బతో కూలీ ..

రఘునాథపల్లి : వడదెబ్బతో కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని ఫతేషాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సులుగూరి వెంకటయ్య (57) ఫతేషాపూర్‌లో కూలీగా టీఫైబర్ పనులు చేస్తున్నాడు. గ్రామ ప్రాథమిక పాఠశాల ఎదుట మండుటెండలో పని చేస్తుండగా ఆయన అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. స్థానికులు గమనించి పరిశీలించగా అప్పటికే వెంకటయ్య మృతి చెందాడు. కాగా వెంకటయ్య వడదెబ్బకు గురై మృతి చెందినట్టు తెలుస్తోంది. మృతుడి కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లున్నారు.


దుగ్గొండి : మృతురాలు దొనికెల సమ్మక్క (ఫైల్)